

# 18 శాసన క్రీడాభిరామము

"నిన్న కనబళ్ళేదేం" అన్నారు రామిరెడ్డిగారు.

"లిటిగేష నొచ్చింది" అన్నాడు సుబ్బరాజు ఉసూరున కూర్చుంటూ.

రెడ్డిగా రిప్పించిన దాహం పుచ్చుకుని స్తిమితపడ్డాక "ఎరక్క చిక్కడ్డా నిందులో.... అన్నీ అడ సవాళ్ళూ, మడత పేచీలూను" అన్నాడు. సుబ్బరాజు స్వతహా అరు బయటపడే మనిషి కాడని రెడ్డిగారికి తెలుసు "ఏవిటి కథ?" అన్నారు.

"అఁ! నామినేషనులో చౌదరిగారి వైసుకి లిటిగేషను పడింది: ఇస్కూలు చదువు కేసిన పుట్టిన్తారీక్కీ, చావు పుటక లాఫీసులో రాయించిందానికీ తభావతొచ్చిందట. ఈనేదో ఉద్యోగం వెలగబెడతాడనీ చిన్నప్పుడు అందులో ఎక్కు వేయించారు. అవతలాళ్ళకి పేచీ తెలిసిందట. నామినేషను పణ్నిచ్చి ఎల్లక్షను దాకా రానిచ్చి అనక ఈనే గెలిస్తే ఇదుగో ఈ గొడవెత్తి, కేసు పెడతారని ప్లానుట. ఎలాగో తెలిసింది. లబోదిబో మంటున్నాడాయన. కాళ్ళు బారజాపేసాడు. దాన్సంగతి కనుక్కుందుకు పట్నం పరిగెత్తాం" అన్నాడు సుబ్బరాజు.

రెడ్డిగారు మందహాసం చేశారు.

"ఓ ప్లీడరిటంటే మరోడటంటాడు. ఏ తేదీ వేసినా పేచీ పెట్టొచ్చునుట. ఏం దారనీ గింజుకుంటున్నారు"

"పెద్ద చిక్కే"

"ఛ ఛస్. ఇదా చిక్కు? మొగసిరుంటే సజావుగా పోట్లాడాల్లప్ప..."

రెడ్డిగారు కొంచెం ముందుకు వంగి సుబ్బరాజు భుజం తట్టారు చనువుగా. "రాజా నివ్వు వైసుకి చిన్నోడివైనా చాలా దెలుసుగాని, ఇందులో తప్పు ఊహ జేస్తున్నావు. ఇలా ఎవారాల్లో – ముఖ్యంగా కోర్టు గొడవల్లో చిన్నదనేదే లేదు. ఉన్నా అది అవుసరాన్నిబట్టి పెద్దదవుద్ది. ఇపుడు ప్రెసిడెం ఎలక్షను గురించి రాజ్యాంగాన్నెందుకు సవరించారంటా? అజ్జెప్పు. తొంభై ఓట్లేటూ తొమ్మిదటూ పడిగెలిచినా, ఆ నూరో ఓటు పణ్నెందువల్ల ఎల్లక్షను చెల్లదంటున్నారని గదా! మరది చిన్నదికాక మరేటి? కానీ, రేపొద్దున్న యాభయ్యిటూ నలభై తొమ్మిదటేపూ పడ్డపుడు అదే పెద్దదవుద్ది గదా!"

"అయితే ఇప్పుడు చౌదరిగారి కోసం రూలును సవరించాలంటారా?" అన్నాడు సుబ్బరాజు.

"దానికేవుంది? మార్చడానిగ్గా పోతే రూలుసు మరెందుకులే. ఎవడో జెప్పినట్టు రూలుసు సవరించడానికీ, మార్చడానికే పుట్టాయిట. కుంటి వ్యాఖ్యానాల్జేసి చమత్కారంతో వాటిని నెగ్గించే వాళ్ళున్నప్పుడు మార్చకేం జేస్తారు మరి. సాంబయ్య కథ తెలీదు గావాలు. ఎల్లక్షనులో ఏనాడూ నిలవాలేదు, గెలవాలేదు గానీ, చిన్నచిన్న రూలుసు తోటే పెద్దపెద్ద ఆటలాడించాడు వెనకనించి. అడి చదువెంతో మనకి దెలీదుగాని, కావల్సింది తెలిసి వెవహారం జేస్తాడనిపించింది. మైన రచ్చిరెడ్డింట జూశాను మొదటిసారి మా తోటల్లుడింటికి చుట్టపు చూపుగా వెళ్తే. యల్లక్షన్లవుతున్నాయి నాల్రోలుండూ అన్నాడు. అచ్చిరెడ్డికి మైన్లు లేవుగాని, దర్జా, ఆ ఖర్చూ జూసి మైనరని బిరుదిచ్చారు. బియ్యేదాకా కాలేజీ చదివాడులే. ఆసా రెల్లక్షనుకి అతనికి పార్టీ టికెట్టు రాలేదు. బుచ్చిరెడ్డి అని అతని పింతండ్రి కొడుకు. అతనికిచ్చారు. చాలా తగాదా పెట్టాడు అచ్చిరెడ్డి. పైనించి పెద్దలొచ్చి సర్ది చెప్పి అపారు. అళ్ళెళ్ళగానే, కింది నించి చిన్నలొచ్చి రెచ్చగొట్టి ఎగసందోశారు. ఇండిపెండెంటుగా నిలబడూ – ఒక్క ఊపు ఊపేద్దారి పార్టీని, అళ్ళ ప్రిష్టీజీనీ" అన్నారు. అయినవాళ్ళొద్దన్నారు గాని, కానోళ్ళ మాటే చెవినిబెట్టి ఈ గోదాలోకి దూకాడు అచ్చిరెడ్డి. నే వెళ్ళేసరికి తతంగవంతా అయ్యేపోయిందనుకో.

ఈ యన్నదమ్ముల తగాదా జూసి అవతల పార్టీ వోళ్ళు తగ్గి అచ్చిరెడ్డి ఇండిపెండెంటుగా నిలబడితే బలపరుస్తామన్నారు. మీ పలుకుబడీ, డబ్బూ, మా మద్దతూ గలిస్తే ఇహ జెప్పాలా అన్నాడు వాళ్ళ రాయబారి. అచ్చిరెడ్డి సై అన్నాడు.

నామినేషను రాయిస్తున్న రోజున నలుగురం కూర్చున్నాం. హస్తవాసి మంచిదని నన్నే రాయమన్నారు ఫారం. ఆపండాపండంటూ వచ్చాడు సాంబయ్య. చాలా గొప్పగా నవ్వాడు. నామినేషను మీద అచ్చిరెడ్డిగారే రాయాల్దప్ప, మీ దస్తూరీ పనికి రాదన్నాడు. సాంబయ్యకి బుచ్చిరెడ్డి మనిషని పేరుందట లోగడ. కాని, అతని వెంట తిరగడం మానేశాట్ట. దానికి తోడు అచ్చిరెడ్డి డ్రెస్సు వేసుకోడం మొదలుపెట్టాడు – ఆ వేస్టుకోటు, బెల్టు, జోడు, పంచెకట్టూ, పట్టుకండువా అన్నీ ఇవే. ఢిల్లీలో చూడు – అచ్చు నెహ్రూగారిలా ఎందరు పొలిటీషియన్లు కనబడతారోను. అదో సూచన. ఇహ మళ్ళీ మళ్ళీ నోరెత్తి విడమర్చి వేరే చెప్పకుండా, ఇలా వేషభాషల్లో ఒక్కసారి ఇమిటేషన్ జేసి పారేస్తే సరిపోతుంది. సాంబయ్య డ్రెస్సు మార్చినప్పట్నించి అచ్చిరెడ్డి కనిబెడుతూనే ఉన్నాడు. నాల్రోలు చూసి పలకరించాడుట. స్నేహం మళ్ళీ ఆరంభమయింది. కొత్త స్నేహం గదూ – సామెజ్జెప్పినట్టు ఇట్టే పుంజుకుంది.

సరే, అతనలా అనగానే అందరం తెల్లబోయి చూశాం. నాకూ పాలుబోలేదు. ఎల్లక్షనెవరాలూ, కేసులూ, గట్రా చాలా చూసి తిరిగినవాడు సాంబయ్య, ఉత్తి పుణ్యానికిలా అండని దెల్సు మరి.

నామినేషను ఫారంలో 'ఫిల్డుబై' అని ఉంటది. 'ఫిల్డుబై' అనగా ఫలానావాడి 'చేత' అని అర్థం. చేత అంటే సాక్షాత్తూ స్వయానా వాడి స్వహస్తాలతోటే రాయాలిట. కావాలిస్తే పోట్నా హైకోర్టు కేసు ప్రెసిడెంటుంది. పరమేశ్వర కుమార్ వర్సను లహతాన్ చౌదరి చూసుకోండి అన్నాడు సాంబయ్య దర్జాగా.

అచ్చిరెడ్డి నాకేసి అదోలా చూశాడు. పెద్దోడివి జహంగేరులా బుర్రమీసాలు పెంచావ్గా ఈపాటి దెలీదా అన్నట్టు.

నేను ఏదో చెప్పబొయ్యేలోగా సాంబయ్య మళ్లీ అందుకుని, "రెడ్డిగారూ, వీట్లో చాలా జాగర్తగా ఉండాలి. అంతెందుకు? ఇంగ్లాండులో ఓ కేసయింది. అందులో అభ్యర్థి తన పేర్రాసినపుడు ఇంటి పేరు సొంతం రాయకుండా పొడక్షరాలు వేశాడుట. అంతేనండి. కేసు పెట్టాడవతలివాడు. నామినేషను సరికాదని ఎల్లక్షను కొట్టేశారు" అన్నాడు.

అందరూ నివ్వెరపోయారు. అచ్చిరెడ్డిగారు ఇంకో ఫారం రాయాలా అంటున్నాడు. ఇంకెవరో అపశకునం అని గొణిగారు.

"అయితే సాంబయ్యగారూ, మీరు చెప్పిందేవిటి? లహతాన్ చౌదరి కేసులో, బై అంటే స్వహస్తం అన్నది ఆర్గ్యుమెంటా? జడ్జిమెంటా?" అన్నాను నేను కొంచెం బెరుగ్గానే.

సాంబయ్య ఉలికిపడి నాకేసి చూసి, "ఏం? జడ్జిమెంటే కామోసు" అన్నాడు.

నా వూహ రైటే అయింది. సాంబయ్య బుకాయించనన్నా బుకాయించాలి, లేకపోతే, సొంతం తెలీకనన్నా పోవాలి.

"నామినేషనులలో అభ్యర్థి స్వహస్తం ఉండాలని తీర్పిస్తే ఎలాగయ్యా? అదే రూలయితే, చదువుకోని వాళ్ళు, నావంటి నిశానీలు ఇహ యెల్లక్షనుకు నిలబడకూడదనేగా. అలా అయితే, అది మరి రాజ్యాంగానికి చుక్కెదురు కదూ?" అన్నాను.

సాంబయ్యే అందరికన్న ముందు అందరికన్న గట్టిగా నవ్వేశాడు.

"రైటే. రైటే. తమాషాకన్నాను రెడ్డిగారూ. ప్లీడరుగారు అలా ఆర్గ్యుమెంటు చేస్తే జడ్జిమెంటులో ఆ వాదాన్ని కొట్టేశారు. అహ... రేప్పొద్దున్న ఎలాటి చిక్కులొచ్చేదీ మన అచ్చిరెడ్డి గారికి తెలియద్దా అని హెచ్చెరుగ్గా చెప్పానంతే" అన్నాడు.

అచ్చిరెడ్డి ముఖం ముడుచుకుని ఇకిలించాడు.

"ఇహనేం? ఈయన్ని మనకి లీగ లెడ్వయిజరుగా వేసుకోరాదూ?" అన్నాన్నేను.

సాంబయ్య నా చేతులు పట్టుకున్నాడు. "ఛఛ ఎంత మాట....?" అంటూ. సర్లే, అవన్నీ ఎందుకు. ముఖస్తుతి మాటలనుకో. మొత్తానికి మేమిద్దరం నేస్తం గట్టాం.

నామినేషను రాయడం పూర్తి అయి అంతా సంతకాలు పెట్టేశాక, సాంబయ్య మళ్ళీ ఓసారి క్షమాపణ లాటిది చెప్పుకున్నాడు.

"అసలు చిన్నచిన్న విషయాల మీద ఎల్లక్షను కేసులకి ఆస్కారం ఉండరాదని ఒక నియమమే ఉందనుకోండి. అంచేత పాట్నా కేసు ప్రెసిడెంటు కాకపోయినా రేపు బుచ్చిరెడ్డి ఓడాక తెలివితక్కువగా కేసుకి దిగినా దెబ్బతింటాడు" అన్నాడు.

"సర్లేవయ్యా సంజాయిషీ లింకా ఎందుకు" అన్నాను నవ్వుతూ భుజం తట్టి.

మేఁవిద్దరం జతగట్టడం చూసి అచ్చిరెడ్డి పొంగిపోయి, "ఇహనీ కాంపెయిను నడిపే భారం మీ ఇద్దరిదీ అన్నగారూ" అనేశాడు.

ఇద్దరిదీ అని అతనన్నా, అంతా సాంబయ్యే చేశాడు. ఏ మాటకామాటే జెప్పాలి. అందులో అతనికతనే సాటి. నాకా ప్రజ్ఞ లేదు. చురుకు పాలెక్కువ వున్నవాడు

గాబట్టి దూకుడుగా దిగాడు. ఆరంభంలో కొన్నాళ్ళపాటు ఎదటి వాడిమీద దాడి చేదామన్నాడు. దాన్ని నెగెటివు కాంపెయి నంటారని చెప్పాడు. ఓహో అన్నాను.

కాని ఆ నెగెటివ్ కాంపెయిను బెడిసి కొడుతుందని నాకు భయం. ఇప్పటికీ అంతేననుకో. బుచ్చిరెడ్డి దగ్గర కొన్నాళ్ళున్నాడేమో. అతని గురించి నాలుగు తెలుసు. అందుకని అతని జాతకం దీసి బజార్న బెట్టాడు సాంబయ్య. పోస్టర్లలో అచ్చిరెడ్డికి ఓటెయ్యమన్న వాటికన్న బుచ్చిరెడ్డికి వద్దనే ధోరణిలోనే ఎక్కువేయించాడు. బుచ్చిరెడ్డి చేస్తానన్న పన్లు ఏకరువు బెట్టి, మాకు ఓటేస్తే ఇంకేవన్నా జేస్తాంగాని, ఇవి మాత్రం చెయ్యం. ఇవి జనానికి మేలు చేసేవిగావు అంటూ ప్రచారం చేశాడు. కథ కాస్త పైస్థాయి కొచ్చేసరికి వ్యక్తినింద దాకా వచ్చేశాడు.

ఒక సభలో గావోసు, అచ్చిరెడ్డికి ఓటేస్తే అపోజిషను వాళ్ళకి మూగతనం వచ్చేస్తుంది. కార్టూనులు వేసే వాళ్ళూ, విమర్శలు చేసేవాళ్ళూ, సెటైర్లు రాసేవాళ్ళూ మూలబడి మాడిపోతారు. అంత గొప్పగా వేలెట్టి చూపి వంకబెట్టేందు కాస్కారం లేకుండా ఉంటుంది అన్నాడు. చమత్కారం బాగుందని చుట్టూ ఉన్న వాళ్ళు అనడంతో రెచ్చిపోయి మరి పదిసార్లు అదే మాట అన్నాడు.

ఓనాడు బుచ్చిరెడ్డి అందుకుని దానికి జవాబును ప్రయోగించాడు.

"మరే, అచ్చిరెడ్డికి ఓటేస్తే హేళన చేసేవాళ్ళు మూలబడతారు. అందుక్కారణం పరిస్థితులు అంత ఘోరంగా హేళన లన్నిటినీ దాటిపోయి ఉండడమే" అన్నాడు.

"అచ్చిరెడ్డికి ఓటేస్తే అపోజిషను వాళ్ళ నోళ్ళు మూతపడతాయట. నిజమే. వాళ్ళంతా ఆయనగారి పరిస్థితులు చూసి నిశ్చేష్టులై కొయ్యబారిపోతారు" అన్నాడు.

ఈ దెబ్బతో అచ్చిరెడ్డి కంగారుపడి, సాంబయ్యని పిలిచి చివాట్లేశాడు. "ఇదేందయ్యా నువ్వు ని నెగెటివ్వులును, చూడు కథ అడ్డం తిరిగి బెడిసి కొట్టింది. ఆళ్ళూ గూబ్బద్దల కొడతన్నారు, అత్తెలివి చమత్కారాలకి దిగొద్దు ఇంకెప్పుడూ?" అన్నాడు.

అక్కడితో సాంబయ్య కొంచెం తగ్గాడు. కాని అప్పటికి అవతలి వాళ్ళు కొత్త పంథాలో కూడా ప్రచారం ఆరంభించారు. "ఓటు కావలిస్తే తనేం చేస్తాడో చెప్పాల్లప్ప ఇలా మనల్ని తిట్టిపొయ్యడం ఏం బుద్ధి? ఇదేం మర్యాదా" అన్నారు.

జనం కూడా ఈసడించుకున్నారు.

ఎవరన్నా జెప్పారో, తనకే దట్టిందో మరి - మరి - నాకు దెలీదుగాని, ఆ రాత్రి అచ్చిరెడ్డి నన్ను చాటుకి దీసుకెళ్ళి సాంబయ్య గురించి నా కనుమానంగా ఉందన్నాడు.

అబ్బే. దగాజేసేవాడు కాదు అని నేను అనబోయే వరకూ అచ్చిరెడ్డి తన అనుమానం మరేం కాదనీ, ఇతనికి నిజంగా సాధక బాధకాలూ, శాస్త్రం దెలుసా అనీ అన్నాడు. నేను మాటాడకూరుకున్నాను. ఆ సాయంత్రవేc కబుర్ల మధ్య సాంబయ్య నిష్కారణం ఓ కేసు యేకరు బెట్టాడు. అంబేద్కరుగారు పోయినప్పుడు స్టేట్సు కవున్సిలులో సీటు కాళీ అయితే, దానికి జరిగిన బై ఎలక్షనులో పి.ఎస్. రాజ్ భోజ్‌గారిని కాంగ్రెసు నిలబెట్టింది. అప్పుడే బొంబాయి అసెంబ్లీ కొత్తగా ఏర్పడింది. సరే, ఆ సీటుకి అదొక్కటే నామినేషను అయినందువల్ల పోటీ లేదని ఆయన ఎన్నికయినట్లు ప్రకటించారుట. కాని అప్పటికి కొత్త అసెంబ్లీ సభ్యులింకా

ప్రమాణ స్వీకారాలు చెయ్యలేదు. ఒక వార్తం పదిరోజులు తేడాలో జరిగింది. ప్రమాణం చెయ్యని సభ్యులు రాజ్యసభకి ప్రతినిధిని ఎలా ఎన్నుకున్నారు? అది చెల్లుతుందా? అంటూ కేసు పెట్టారొకాయన. అందుమీద బొంబాయి హైకోర్టు మీమాంస చేసింది. పుస్తె ముడిపడినట్టా కానట్టా? అని. 'అసెంబ్లీలో ప్రవేశించడం' అనే మాటకి అర్థం ఏమిటి అన్నారు. ప్రవేశించడం అంటే బొందెతో వెళ్ళి కూర్చోడమేనా - లేక చట్టరీత్యా సభ్యుడు అయి, ఆహక్కులు పొంది వాడుకోడమనా? ప్రమాణ స్వీకారం చెయ్యకుండా సభ్యుడుగా వ్యవహారం చేసి ఓటింగుల్లో పాల్గొనడం ఎన్నికల చట్టం 188 ప్రకారం అక్రమం కాబట్టి, ప్రమాణం చేసేవరకూ ఎన్నిక అయినవాడు సభ్యుడి కింద లెక్కకాదని ఒకరు వాదించారు. అలా కాదు. ఎన్నిక అయిన సభ్యులు రాజ్యసభకి తమ ప్రతినిధిని ఎన్నుకోవాలని 80వ సెక్షను చెబుతూంది కాబట్టి 188 కన్న 80 అంకె ముందర వస్తూంది కాబట్టి ప్రమాణం చెయ్యకపోయినా ఎన్నుకునే హక్కు ఉన్నట్టు తెలుతూందని కొందరన్నారు. ఆరునెలలు వరుసగా గైరుహాజరయితే అతని సభ్యత్వం రద్దు అయినట్టు అసెంబ్లీ ప్రకటించాలని 190లో ఉంది గాబట్టి - ప్రమాణం చేసినా మానినా ఎన్నిక అయినవాడు సభ్యుడికిందే జమయినట్టు రుజూ అవుతుందన్నారు. అసెంబ్లీలో ప్రవేశం అన్న చిన్న మాటకి అర్థం మీద అంత లిటిగేషనయింది. అంచేత మనం జాగర్తగా ఉండాలి, ఆవటాని చెప్పకొచ్చాడు సాంబయ్య.

సందర్భం లేకుండా, దానికి సంబంధించిన చర్చగాని, ప్రస్తావనగాని లేకుండా ఉత్తి పుణ్యానికి సాంబయ్య ఇదెందుకు చెప్పాడో ఎవరికీ అర్థంకాలేదు. ఎవరూ మాటాడలేదు. ఇప్పుడే వస్తాను అంటూ పనున్నట్టు లేచి పక్క గదిలో కెళ్ళిపోయాడు సాంబయ్య.

మావసం దిన్నోడు బొమికలు మెళ్ళో గట్టుకున్నట్టుంది. ఏదో సతిగాడు గావాల - అది గాస్తా మన్నెత్తిన రుద్ది పొయ్యాడు అన్నాడొకాయన మెల్లిగా.

కోటి విద్యెలూ కూటి కొరకే అన్నాడింకో పెద్ద గుంభనంగా.

అదేమ్మాటలే, శానా యెక్కువ సతిగినా అంతేనూ. లోపల ఇవఁడక అలా పైకి తన్నుకొస్తది - ఈ సతిగిన వాళ్ళతో ఇదే సిక్కు. యెప్పుడెందుకేం జెబుతారో మనకి తెలిస్సావదు అన్నాడు అచ్చిరెడ్డి బావమరిది.

మొత్తానికి సాంబయ్య యెందుకు చెప్పాడో తెలీదుగాని అచ్చిరెడ్డి మనసు కుదుటపడింది. ఈడిక్కొంత డొక్క సుద్దుందిలే అని స్తిమితపడ్డాడు.

ఇజ్జరిగిన మూణ్నాలుగు రోజులగ్గావాల సాంబయ్య ఆదరాబాదరా వచ్చి రాచకార్యపుంది రమ్మన్జెప్పి అచ్చిరెడ్డిని, నన్ను ఓ గదిలో కూచోబెట్టి తలుపేశాడు.

ఇపుడు ఎలక్షనుకి కొత్త మలుపొచ్చిందన్నాడు ఆయాసపడుతూ. పార్టీ తరపున ఒకడూ, సాతంత్రుడుగా ఒకడూ మాత్రవే నిలబడడం చూసి, ఇందాకా తటపటా యించిన మరో పార్టీ పెద్ద మనిషొకాయన ఈవాళ నామినేషను పడేయించేస్తన్నాడని చెప్పాడు. అచ్చిరెడ్డి అదిరిపడి, అయితే మన ఖర్చులు తడిసి మోపెడవుతాయా అన్నాడు. సాంబయ్య నవ్వి బుజం తట్టి అదేగా నేను చెప్పొచ్చిందీ అంటూ తన ప్లాను చెప్పాడు.

అతనితో బుచ్చిరెడ్డి మాటాడాడుట. మనం మనం తగూలాడుకుని డబ్బు

తగలేసుకోడవేల, మీ వోణ్ని తగ్గమనూ, కొత్తగా గోదాలో కొచ్చినవాడి పసేవిటో నీకు దెల్సుగదా? అంచేత మనోడు తప్పుకుంటే నా గెలుపు ఖాయవుూఁ అన్నాట్ట. పోతే అలా తప్పుకుందుకు ప్రతిఫలంగా – ప్రతిఫలవఁను ఏవఁను – అచ్చిరెడ్డికి కవున్సిలులో సీటుకి ఏర్పాటు చేయిస్తానన్నాట్ట. పార్టీ పెద్దలతో మాటాడ్డవయిందనీ, అచ్చిరెడ్డికి కవున్సిలు సీటివ్వడానికి అంతా ఒప్పుకున్నారనీ కూడా చెప్పాట్ట.

"మనవలా ఇప్పుడు తగ్గి, ఇంకో నెల్లాళ్ళ తరవాత అళ్ళ పార్టీ తరపున కవున్సిలు సీటు సంపాదించుకుంటే, అది లంచం దిన్నట్టుగాదా. అది దగా అవదా, నేరం అవదా" అన్నాను నేను.

సాంబయ్య నవ్వాడు. "రెడ్డిగారు సత్తెకాలపు మనిషి. మీదంతా విడ్డూరం. ఇందులో కొత్తేవుంది గనక? ఎన్నికలనేవి మొదలయిన కాణ్నించి నామినేషను చివర్రోజు దాకా నిలబడి తప్పుకోవడం, ఏదో ఒకందాన బాగుపడ్డం రివాజుగానే ఉంటూంది గదా. నే నెరిగిన ఎందరో ఇలా బాగుపడి మేడలు గట్టారు. ఇది రాజకీయ వ్యాపార ధర్మం. దీన్ని దగా అనీ, నేరఁవనీ ఎవడంటాడు" అన్నాడు.

"అది సర్లే. మామూలుగా ఎవుడూ అనడంలేదనుకో. మనం తప్పు కున్నప్పుడూరుకున్నా అనాక కవున్సిలు కెక్కినపుడు, మన దగ్గర దగా తిన్న పార్టీ వాళ్ళూరుకుంటారా? పరువు పైకోర్టుదాకా తీసుకెళ్ళి ఎలక్షను రద్దు చేయించెయ్యర్రూ?" అన్నాను నేను.

అచ్చిరెడ్డి కొంచెం కంగారు పడ్డాడు.

సాంబయ్య మాత్రం గర్వంగా చూశాడు. పకపక నవ్వాడు. 'అందుకే నాలాటోడి సలహా అన్నారు మరి. అయన్ని చూడకుండానే నేనీ బేరాని కొప్పుకున్నానా? మీరు గావాలంటే కనుక్కోండి – ఏదో కొంత నష్టపరిహారం తీసుకుని పోటీ నుంచి తప్పుకోడం మీరన్నట్టు లోగడ నేరవేఁ! కొన్నాళ్ళలా ఉంటూ వచ్చి దరిమిలాను – 1956 నించి గాబోలు ఉండడం మానేసింది. ఇపుడది రాజాలాటి పని' అన్నాడు.

అచ్చిరెడ్డి నవ్వాడు, సాంబయ్యకి పౌరుషం వేసుకొచ్చింది. "నవ్వకండి. నమ్మకం లేకపోతే రాజస్థాన్ కోర్టులో దుర్గాప్రసాద్ చౌదరి వర్సస్ బెహారీ లాలుకేసు చూడండి. అందులో చౌదరి మీద పోటీకి దిగిన సేఠ్ సోభగ్ మల్ లోడా అనే ఆయన మీలాగే నిలబడి కొన్నాళ్ళు ప్రచారం కూడా చేశాక మానుకున్నాడు. అనాక చౌదరి తరపున ధేబరుగారెళ్ళి మాట్లాడి సేటుగారికి రాజ్యసభ సీటిప్పిస్తామని పార్టీ తరపున మాటిచ్చాక పోటీనించి తప్పుకున్నాడు. మీక్కావాలంటే చూసుకోండి నాకు బాగా గుర్తు కూడాను. ఎ.ఐ.ఆర్. 1958 కేసుల వాల్యూములో 324 వ పేజీ. ఆఁ" అన్నాడు ఆయాసపడుతూ.

ఎన్నికల చట్టంలో కరప్షను ప్రాక్టీసులు అన్న పేరిట రెండు సెక్షనులున్నాయిట. ఆ యపరాధాల జాబితాలో పెద్దరకం, నాసిరకం కేటాయింపుగా ఉంటాయి. నూటిరవై నాలుగో సెక్షనో ఏదో అన్నాడు – అందులో ఉండేదిట ఈ 'లంచం' పుచ్చుకోడం, దరిమిలాను చట్టం సవరించి తీసిపారేశారు. ఒకరకంగా రైటేననుకో. ఎన్నికల చట్టం ఎన్నికల గురించి మాటాడాలి దప్ప – తప్పుల్ని ఎంచి దండించడం దాని పనిగాదన్న ఉద్దేశంతో సవరించారు.

అసలదీగాక, శానామంది ఇదేపని చేస్తూ ఉంటే ఎందరి మీదని కేసులెడుతూ కూచుంటారు? మెజార్టీ జనం చేసేది నేరవెలా అవుద్ది?

"అలాగయితే ఇహా కావలసిందేవుందయ్యా. నీకు హైరాణ తప్పుతుంది. ఖర్చు తప్పుతుంది. సీటుకి సీటు వస్తుందే" అన్నాను నేను.

నామినేషను ఉపసంహారం జేసుకుందు కింకో షరతుందన్నాడు సాంబయ్య. ఆఖర్రోజుదాకా ఆగి, మళ్లీ ఇంకోడెవడూ నిలబడకుండా, నీకు మద్దతిస్తున్న పార్టీ ఎవణ్ణీ నిలబెట్టకుండా, దేనికీ టైము లేకుండా జేసి మరీ మానుకోవాలన్నాడు. పోతే, ఇంతవరకూ పబ్లిసిటీ కయిన ఖర్చులిగ్గాను పదివేల దాకా ముట్టజెబుతానన్నాట్ట బుచ్చిరెడ్డి.

"అంతేగాదు మన దగ్గర ఇంకా వాడకుండా మిగిలిపోయిన పోష్టరు కాయితాలను, బోర్డులను, అట్టలను బుట్టలను ఈ సరంజామా అంతా ఏదో ఓ ధర జేసి బుచ్చిరెడ్డి కమ్మేద్దాం" అన్నాడు సాంబయ్య.

"అదెలాగ? అయన్నీ అడు మటుకేం జేసుకుంటాడు?" అన్నాడు బుచ్చిరెడ్డి.

"అ ఏవుందీ ఒక్కక్షరవేఁ గదా తేడా? అచ్చిరెడ్డి అన్న పేర్లో 'అ' మీద 'బు' అక్షరం అతికించేస్తే పోలా" అన్నాడు సాంబయ్య నవ్వి.

అక్కడితో అచ్చిరెడ్డి ఒక తీర్మానాని కొచ్చేశాడు. ఇది లాభసాటి బేరవనీ, దీనికి ఒప్పుకోవచ్చుననీ.

ఈ ముక్క మూడో కంటి వాడికి తెలీరాదన్నాడు సాంబయ్య.

"మూడో కంటివాడికి తెలీకుండా ఏదీ ఉండదు. వాడి పేరు గలాడివి నువ్విక్కడ ఉండనే ఉన్నావు" అన్నాన్నేను.

సాంబయ్యకి నా మాట తెలీలే. తికమకపడి నవ్వి, సావిట్లో పోష్టరు లెక్కచూడబోయాడు.

ఇందులో పెద్ద దగాకోరెవరూ అని ఆలోచిస్తూ కూర్చున్నాను నేను. లాభసాటి బేరం చూసి, ఇటు తనను నమ్మి మద్దతిచ్చిన పార్టీని దగా చేసిన అచ్చిరెడ్డా? అచ్చిరెడ్డిని వాడుకుని ఎదటి పార్టీలు రెండింటేని, కడవఁ సొతంత్రుల్నీ నిలబడకుండా జేసి పోటీ లేకుండా నెగ్గుతున్న బుచ్చిరెడ్డా, అతని పార్టీనా అన్నది తెలీలేదు. ఇంకో గంటకి సాంబయ్యొచ్చి, కొత్తగా పోటీకి దిగిన మూడో ఆసామి కూడా దారి కొచ్చేస్తున్నాడనీ, అది కూడా జరిగితే నామినేషన్‌లు గడువు తీరిన మర్నాడు బుచ్చిరెడ్డి ఒక్కడే ఫీల్డులో ఉంటాడనీ, పోటీ లేకుండా గెల్చుకుంటాడనీ, ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టవుతుందనీ చెప్పాడు సంబరపడిపోతూ.

ఈళ్ళంతా ఎవర్నెవరూ దగా జేసుకోటం లేదనీ, అంతా కలిసి ప్రజల్ని బోల్తా కొట్టిస్తున్నారనీ తోచింది. మధ్యాహ్నవేళ మనసు బాగుండక అలా ప్లీడరుగా రింటికేసి షికారెళ్ళాను. ఎలక్షను 'లా పాయింట్లూ'యనికీ బాగా తెలీవు. కొత్తగదా! మన కెలక్షన్లొచ్చెన్నేళ్ళయింది గనక? కాని పాపం ఓపిగ్గా నేనడిగిన పాయింట్ల కోసం కేసులు దిరగేసి చూసి చెప్పాడు. శానా సంగతులు దెలిశాయి.

కొంచెం కంగారు బుట్టింది. చురుగ్గా అడుగేసి కొంపజేరాను. వాకిట్లో జీపులు, లవుడు స్పీకర్లు, కుర్రాళ్లు, బుర్రకథల దళంవాళ్ళు అంతా – రోజూలాగే సందడిగా

ఉన్నారు. 'అచ్చిరెడ్డి ప్లాను ఎవరికీ దెలిసినట్టు లేదు. గబగబా లోనకెళ్ళాను. అచ్చిరెడ్డి ఇలా' అని గదిలోకి కేకేశాను.

"పోటీనించి దిగద్దనేగా. తెల్సు. సాంబయ్య చెప్పాడిప్పుడే" అన్నాడు అచ్చిరెడ్డి నవ్వి.

నాకు శానా ఆశ్చర్యమైంది. కవున్సిలులో సీటుకి మాట దీసుకుని, ఈ పోటీ నించి తగ్గడం ఎలక్షను చట్టం 124 వ సెక్షను కింద అక్రమంగాకపోయినా ఆ మనిషి మీద పీనలుకోడు 171 వ సెక్షను కింద కేసు బనాయించి గూబ కదలెయ్యొచ్చు. దానికింద ఖాయమైంతే ఎలక్షను చట్టంలో నూట ముప్పయి తొమ్మిదో, ఏదో సెక్షను కింద ఉన్న సూత్రం ప్రకారం ఆ అభ్యర్థి ఎన్నిక మీద దెబ్బతీస్తుందట. ఇటు శిక్షా పడుతుంది. అటు సీటూ చెడుతుంది. ఇంత వయినం ఉందని ప్లీడరుగారు చెప్పారు. ఇదంతా మరి సాంబయ్యేంచేత చెప్పలేదూ అని కంగారు బుట్టింది నాకు. అంతకు ముందున్న సెక్షన్లు చదివినోడు ఇది మటుకెందుకు చెప్పలేదూ? తెలీదా"

అంతేట. సాంబయ్యకి తెలీదుట. గాని అనుమానవుండి మాకీ సలహా జెప్పాక తనూ తన దారిన ప్లీడరింటికెళ్ళి లా పుస్తకాలు చూసి సలహా జేశాట్ట. సంగత్తెలీగానే నేను రావడానికో నిమిషం కితవేఁ వొచ్చి, అచ్చిరెడ్డికి వొయినం అంతా జెప్పి తప్పు మన్నించమన్నాట్ట. బుచ్చిరెడ్డితో బేరాలూ, రాయబారాలూ రద్దు చేసేద్దాం అని వెళ్ళాడట.

సర్లే. గండం దప్పిందని సర్దుకున్నాం. ప్రచారం ముమ్మరంగా సాగింది. అన్నదమ్ముల బిడ్డలు రచ్చకెక్కి పోటీ చేస్తున్నారని ఊరూ వాడా హోరెత్తిపోయింది. దానధర్మాలను, నాటకాలను, బుర్రకథలను ఒకటేవిటి ఎన్ని ఎన్నందాల చెయ్యాలో అన్నందాలా చేశారు. పార్టీలిచ్చారు. కూతవేటు దూరంలో దొరికిన కవులికి సన్మానాలు చేయించారు. పెళ్ళిపీటల వెనక నించుని ఉపన్యాసాలిచ్చారు. బళ్ళు, కార్లు సప్లయి చేశారు ఎవరెక్కడికి వెళ్ళాలన్నా. కొన్నాళ్ళపాటు ఊళ్ళో కిరాయి రిక్షాల గిరాకీ పడిపోయింది.

రెండు గుర్రాలూ - 'ఫోటో ఫిని'షంటారు జూడూ గుర్రప్పందాల్లో - అవిగో అలాగొచ్చాయి. పోలింగు రేపనగా ఇవాళ పోటీ ఎలా పడితే అలా వుంది. ఆ రోజు పొద్దుణ్ణించీ ఇంటింటికీ వెళ్ళి ఓటు హక్కున్న ప్రతివాడికీ పళ్ళు తోమి కాఫీ అందించడం దాకా వెళ్ళిపోయారు. రోడ్ల మీద రొజాయిలు పరిచేశారు. కాని పోలింగు నాడు కాన్వాసింగులు ఒళ్ళు దగ్గర పెట్టుకు చెయ్యాలని ఎవరికి వారే హెచ్చరించుకున్నారు.

ఆ రోజున ఒకటి రెండు హోటళ్ళవాళ్ళు కాఫీ ఫలహారాలు చాలామందికి ఊరికినే ఇచ్చారు. అక్కడా అక్కడా కూర్చున్న పెద్దమనుషులు బుచ్చిరెడ్డికే తాము ఓటేస్తున్నట్లు ప్రకటించారు యధాలాపంగా. కొందరు, పక్కవాళ్ళకి నూరిపోశారు ఫలానావాడికే వెయ్యాలని. పోలింగు రోజు ఉదయం ఏడున్నరకల్లా సాంబయ్య ఎక్కణ్ణించో పరుగున వచ్చి పోలింగు స్టేషను దారిలో దారి పొడుగునా మూడు నాలుగుచోట్ల బుచ్చిరెడ్డిగారు కాఫీ ఫలహారాలూ, గట్రా సప్లయి చేస్తున్నాడని చెప్పాడు. మనం చిట్టచివరి చోటయినా 'చలివేంద్రం' పెట్టకపోతే మాట దక్కదనీ, మన

ఓటర్లు నవ్వుతున్నారనీ అన్నాడు. పోలింగు మిడిల్ స్కూలులో పెట్టారు. దాని కిసింటా ఆ వీధి కీ చివర సాంబయ్య మేనల్లుడి ఇల్లుంది. లంకంత కొంప. తోరణాలు కట్టి అక్కడ భోజన ఫలహార వసతులు పెడదామన్నాడు.

పోలింగు బూతునించి నూరు గజాల లోపల కాన్వాసింగు జరక్కూడదనీ, ఎలాంటి తిళ్ళూ, చిరుతిళ్ళూ పెట్టరాదనీ రూలుందిట. అదీ సాంబయ్యే చెప్పాడు. తను దూరం కొలిచే వచ్చానన్నాడు.

అచ్చిరెడ్డి సరే నన్నాడు. తక్షణం హోటళ్ళనించి రెండు బళ్ళ మీద కాఫీ ఫలహారాలు అక్కడికి తరలించాం. నలుగురు వంటబ్రాహ్మల్ని పెట్టి ఫలహారాల తయారీ కూడా అరంభించాం. సాంబయ్య అచ్చిరెడ్డి ఏజంటుగాబట్టి అక్కడ ఉండరాదనీ, ఎవరో సంబంధం లేనట్టుండే వాళ్ళని పెడదామనీ చెప్పి నలుగుర్ని కుదిర్చాడు. వాళ్లు దారేపోయే వాళ్ళని మర్యాదగా పిలిచి ఫలహారాలు బెట్టి అచ్చిరెడ్డికి ఓటిస్తే మంచిదని మాటవరస కన్నట్టే ఏక వరసన చెప్పకుపోయారు.

అవతలి వాళ్ళిది చూసి గోలపెట్టారు. సాంబయ్య ఎదిరించి మూరు గజాలు కొలిచేశామన్నాడు. కావలిస్తే కొలిచ్చూసుకోమన్నాడు. సాయంత్రం పోలింగు తెమిలే వేళకి తగాదా తారస్థాయి నందుకుంది.

ఆఫీసరు, ఇన్‌స్పెక్టరు అంతా వుండగా, పట్టుదల మీద బుచ్చిరెడ్డి పోలింగు స్టేషనుకి, ఈ టీ పార్టీ కొంపకీ మధ్య దూరం కొలుస్తానన్నాడు.

స్టేషనుగాదు, బూతు దగ్గర్నించి, అనగా బాలెట్ పెట్టెల చుట్టూ కట్టే తడికల గది నుంచి నూరు గజాలు కొలవాలనీ, ఆ లోపలగా ఈ పార్టీ ఇల్లు ఉంటేనే సెక్షను 77 క్రింద కేసు అవుద్దనీ సాంబయ్య వాదించాడు.

ఈ మతలబులన్నీ ఇలా యాకరువు బెట్టడంతో అవతలాళ్ళు రెచ్చిపోయి, సరిహద్దు పాయింటు మీద పట్టుబట్టారు. పోలింగు స్టేషనంటే బూత్ అని అర్థమా, అది ఉన్నగదా, ఆ గది ఉన్న భవంతా, ఆ భవంతి ఉన్న ఆవరణ గోడా, దాని గుమ్మమా, ఆ మెట్లలో ఆఖరి మెట్టు చివరి అంచా అన్నది మీమాంసకొచ్చింది.

బూతు దగ్గర్నించీ కొలిస్తే నూరు గజాల అవతలే తేలింది. కాని బుచ్చిరెడ్డి పట్టుదల మీద బూతువున్న హోలు సరిహద్దు నించి ఈ స్కూలు భవంతి హద్దు నుంచి, కాంపౌండు గోడ నించి కూడా కొల్తలు తీశాడు. అవన్నీ కూడా నూరు గజాలకి లోపలే తేలాయి.

నాల్రోలు తరువాత, అచ్చిరెడ్డి నెగ్గినట్టు ప్రకటన వచ్చింది. మెజారిటీ అట్టే లేదు. మరి నాల్రోలు తరువాత బుచ్చిరెడ్డి కేసు పడేశాడు – ఎన్నిక రద్దు చేయాలని, తను ఎన్నికయినట్టు ప్రకటించాలనీ.

అచ్చిరెడ్డి సాంబయ్య మీద మాట వరసకి మండిపడ్డాడు. కాస్త ఒళ్ళూ పై జాసుకు మనీ చేసుకు రావలసింది యియ్యన్నీ అన్నాడు.

ఆ మాటతో సాంబయ్య అలిగి పెడముఖం పెట్టాడు. నాల్రోలు మొహం చాటేసుకు తిరిగాడు. వారం తరువాత బుచ్చిరెడ్డి గ్రూపులో తిరగసాగాడు.

చివరికి కేసేమయిందని నన్నడక్కు. ఏమయితేనేం. కొన్ని వేలమంది ప్రజలు ఎన్నుకోబోయిన ప్రతినిధి ఎన్నిక అంతా గజమున్నర దూరం మీద ఆధారపడి,

పోయింది. సాంబయ్యకి రూల్సన్నీ తెలుసుననీ, అసలతను బుచ్చిరెడ్డి మనిషినీ, పెందలాళే ఇటేపుజేరి, సలహాదారుగా నటించి, కొన్ని రూల్సు తప్పజెప్పి అనాకా సరుదుకున్నట్టు మళ్ళీ నటించి నిజాయితీ చూబెట్టి, అచ్చిరెడ్డిని బోల్తా కొట్టించాడన్నారు నలుగురూ. అతనే ద్రోహి అన్నారు.

ఎన్నిక రద్దు అయి ప్రజల డబ్బు మరో ఎన్నిక పేరిట దండగ కావడానికి ఇలాటోళ్ళే కారణమన్నారు.

సాంబయ్య చెప్పాడని అచ్చిరెడ్డిని పచ్చిగడ్డి తినమన్నదెవడూ? ప్రజల ప్రతినిధిగా ఎన్నికయి దేశాన్ని పాలిస్తాననే వాడికి ఈ మాత్రం తెలీదా, అలాటోణ్ణి నమ్మిన వాడే ద్రోహి అన్నారు కొందరు.

ఇలా ఒన్నికలలో కలగజేసుకున్నందుకూ, మనం చెయి జేసుకున్నందుకూ, ఇంత అపర్దిష్ట పాలయినందుకూ నాకు చాలా చిన్నతనంవేసింది.

ఇహ కేసులో నేను జోక్యం బెట్టుకోనని జెప్పి చక్కా పోయాను.

నువ్వు జెప్పు సుబ్బరాజూ!

ఈ ఎన్నికకి నిజంగా ద్రోహం చేసిందెవరు? పెడదారి పట్టిన అచ్చిరెడ్డా? పెడదారి పట్టించిన సాంబయ్యా? అతన్ని వెనకనుంచి నడిపిన బుచ్చిరెడ్డా? వెనకనించి కనిపెట్టి ఉంటానని నమ్మించి బోల్తాపడిన నేనా? చెప్పు జూద్దాం" అన్నారు రామిరెడ్డిగారు కథ అపుజేసి.

సుబ్బరాజు ఒక్కక్షణం మౌనం వహించాడు.

"మీరెవరూ గాదు. బ్రహ్మాండమైన ఎన్నిక ఫలితాన్ని గజంన్నర కొలత మీద ఆధారపడేలా చేసిన రూల్సు, రూల్సుని ప్రియురాలి ముంగురుల్లా సవరించడానికి గల సదుపాయాలు. ఇవే విలనులు, నూరు గజాల లోపల కూడదు అంటే నూటొకటో గజంలో చెయ్యొచ్చునని ఒప్పకున్నట్టేగా; గజం ఇవతల చేసింది నేరం అయి, గజం అవతల చేసింది కాకపోవడం కన్నా అన్యాయమేటి?" అన్నాడు సుబ్బరాజు.

"చాలా ఆయాసపడ్డావుగాని ఇలాటూహలు పెట్టుకుంటే పాలిటిక్సులో ఆటిరావు. రూల్సు విలవ నీకింకా దెలీలే" అన్నాడు రెడ్డిగారు.

★ ★ ★